క్లుప్తంగా

మానవ హక్కుల కమిటీ చైర్మన్‌గా నర్సింగదాసు

నేరడిగొండ: జాతీయ మానవ హక్కుల కమిటీ మండల నూతన చైర్మన్‌గా నర్సింగ దాసు నియమితులయ్యారు. జాతీయ చైర్మన్ శ్రీనివాసరెడ్డి సూచనల మేరకు ఆయన శుక్రవారం పదవీ బాధ్యతలు చేపట్టారు.

ఆటో డ్రైవర్లకు స్టిక్కర్లు అందజేత

బోథ్: మండలంలోని ఆటో డ్రైవర్లకు 'మీ భద్రతే మా బాధ్యత' అభయ స్టిక్కర్లను సీఐ వెంకటేశ్వర రావు, ఎస్సై ప్రవీణ్ కుమార్‌లు శుక్రవారం అందజేశారు. ప్రతీ ఆటోకు ఒక క్యూఆర్ కోడ్, నంబర్ కేటాయించారు. ఈ స్టిక్కర్లను ఆటోలకు అతికించారు.

'బీఎల్‌వో సర్వే నుంచి మినహాయించాలి'

తలమడు: బీఎల్‌వో సర్వే నుంచి అంగన్‌వాడీ టీచర్లకు మినహాయింపు ఇవ్వాలని సీఐటీయూ ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు లింగాల చిన్నన్న మాట్లాడుతూ ఇప్పటికే అంగన్‌వాడీలు పనిభారంతో ఎన్నో ఇబ్బందులు పడుతున్నారన్నారు.

14 నుంచి డీసెట్ సర్టిఫికెట్ల పరిశీలన

ఆదిలాబాద్‌టౌన్: డీసెట్ మూడో విడత సర్టిఫికెట్ల పరిశీలన ఈనెల 14, 15వ తేదీల్లో నిర్వహించనున్నట్లు ప్రభుత్వ డైట్ కళాశాల ప్రిన్సిపాల్ రవీందర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 16న వెబ్ ఆప్షన్లు, 19న సీట్ల అలా టిమెంట్, 20 నుంచి 22 వరకు డౌన్‌లోడింగ్, 23న కళాశాలలో రిపోర్టు చేయాల్సి ఉంటుందన్నారు. మిగిలిన సీట్ల కోసం వెబ్ ఆప్షన్లు పెట్టుకోవాల్సి ఉంటుందని వివరించారు.

ద్విచక్ర వాహన దొంగలు పట్టివేత

బేల: మండలంలోని పాటన్ రెవెన్యూ గ్రామ శివారులోని పొలం వద్ద శుక్రవారం ద్విచక్ర వాహనం దొంగతనం చేసిన ఇద్దరు మైనర్ దొంగలను స్థానికులు పట్టుకున్నారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. తడేగామ్‌కు చెందిన ఉమేష్ గ్రామ శివారులోని జాతీయ రహదారి పక్కన ద్విచక్ర వాహనం పార్క్ చేసి, సమీప పొలంలో పనిచేస్తున్నాడు. ఈక్రమంలో మండలంలోని దహెగాం, కాప్సి(బి) గ్రామానికి చెందిన ఇద్దరు మైనర్‌లు ద్విచక్రవాహనాన్ని దొంగలించారు. వెంటనే గమనించిన ద్విచక్ర వాహనం యాజమాని గ్రామస్తులతో దొంగలను పట్టుకుని, ఏఎస్సై సురేందర్‌కు అప్పగించగా పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేద్దాం

సొత్నాల: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేద్దామని ప్రముఖ సామాజిక కార్యకర్త ముడుపు మౌనిష్ రెడ్డి అన్నారు. భోరజ్ మండలంలోని కామాయి గ్రామంలో శుక్రవారం విద్యార్థులకు బ్యాగులు, పుస్తకాలు, పెన్నులు ఉచితంగా పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య లభిస్తుందని, గవర్నమెంట్ పాఠశాలలో చదివిన ఎంతోమంది గొప్ప స్థానాల్లో ఉన్నారన్నారు. అనంతరం అక్షర అనే దివ్యాంగురాలకిఇ వీల్‌చైర్ అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు అశోక్, ఉపాధ్యాయులు రాజేందర్, రాజా రెడ్డి, సాగర్ వైద్య, రాజు, రూప్ రావు, ప్రమోద్, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలను సందర్శించిన ఎంపీడీవో

బోథ్: మండల పరిధిలోని కనుగుట్ట, సాంగ్వి గ్రామాలను ఎంపీడీవో రమేశ్, ఎంపీవో అతుల్ శుక్రవారం సందర్శించారు. కనుగుట్ట పాఠశాలలోని వంటశాలను, ఆహార నాణ్యత పరిశీలించారు. పాఠశాల భవనానికి తాజాగా వేసిన రంగుల పనులు పరిశీలించారు. పాఠశాలకు వెళ్లే రహదారి బురదమయంగా మారడంతో సమస్యను గుర్తించారు. సమస్య పరిష్కారానికి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపిస్తామని వారు తెలిపారు. అనంతరం సాంగ్వి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పరిశీలించారు. నిర్మాణాల నాణ్యత, పురోగతి, లబ్ధిదారుల సమస్యలు వంటి అంశాలపై సమీక్ష చేశారు.

పింఛన్ కోసం నిరీక్షణ

- ఏళ్లుగా మంజూరు కోసం ఎదురుచూపులు
- కొత్తవారికి అందించాలని వేడుకోలు



సిరికొండ మండల పరిషత్ కార్యాలయం

సిరికొండ: ఆసరా పింఛన్ అందక మండలంలోని వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. అన్ని అర్హతలు ఉన్నా పింఛన్ అమలు కోసం కొన్నేళ్లుగా ఎదురుచూస్తున్నారు. తెలంగాణలోని గత ప్రభుత్వం పాత లబ్ధిదారులకు ఆసరా పింఛన్ అందజేసినా కొత్త వారికి అమలు చేయలేదు. దీంతో నాలుగేళ్లుగా కొత్త వారు పింఛన్ మంజూరు కోసం నిరీక్షిస్తున్నారు. కొత్త వారికి ఆసరా పింఛన్ పథకం అమలు కాకపోవడంతో మండలంలోని అనేక గ్రామాల్లో అర్హులైన లబ్ధిదారులు ఆసరా పథకానికి దూరమయ్యారు. కొత్త ప్రభుత్వం అయినా కొత్త వారికి అవకాశం ఇస్తుందని భావించినా ఏడాదిగా ఎదురుచూపులు తప్పడం లేదు.

దరఖాస్తులు స్వీకరించినా..

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలనా కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పథకాల అమలుకు దరఖాస్తులు స్వీకరించింది. దీంతో ఆసరా పథకం ద్వారా పింఛన్ పొందేందుకు మండలంలోని వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు దరఖాస్తులు చేసుకున్నారు. అయితే దరఖాస్తులు స్వీకరించిన ప్రభుత్వం ఇప్పటి వరకు కూడా కొత్త వారికి పింఛన్లు మంజూరు చేయలేదు.

స్థానిక ఎన్నికల నేపథ్యంలో..

రాష్ట్రంలో త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలు జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో దరఖాస్తుదారులకు ఆశలు రేకెత్తాయి. స్థానిక సంస్థల సందర్భంగా ప్రభుత్వం కొత్త వారికి ఆసరా పింఛన్లు మంజూరు చేస్తుందని భావిస్తున్నారు.

తప్పని ఎదురుచూపులు..



నా భర్త నాలుగేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. నేను కూలీ పనులు చేసుకుంటూ కుమారుడితో కలిసి జీవిస్తున్నాను. ప్రభుత్వం నాకు ఆసరా పింఛన్ అందించి ఆదుకోవాలి.

– మంచికంటి యశోధ, సిరికొండ

ఎన్నోసార్లు దరఖాస్తు ఇచ్చిన..



నా భర్త మృతి చెందిన నాలుగేళ్ల నుంచి ఆసరా పింఛన్ కోసం ఎన్నోసార్లు దరఖాస్తు చేశాను. కానీ ఇప్పటివరకు పింఛన్ రాలేదు. కూలీ పని చేస్తూ పిల్లలను సాదుతున్న. నాకు పింఛన్ అమలు చేయాలి.

– జుగ్నక్ సీతాబాయి, సిరికొండ

పట్టించుకోని ప్రభుత్వం..



ఆసరా పింఛన్ అమలు చేయడంలో గత ప్రభుత్వంతో పాటు రాష్ట్రంలో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా పూర్తిగా విఫలమైంది. మండలంలోని వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు ఎందరో ఆసరా పింఛన్ పథకం కోసం ఎదురుచూస్తున్నారు. ఈ పథకాన్ని నిరంతరం అమలు చేయాలి

– బోయిన్‌వాడ్ అమోల్, మండల బీజేపీ అధ్యక్షుడు, సిరికొండ

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


మొక్క నాటుతున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్‌టౌన్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో పేపర్‌డే కార్యక్రమం నిర్వహించడంతో పాటు పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ సమాజానికి అత్యంత అవసరమన్నారు. చెట్లతోనే మానవ మనుగడ సాధ్యమని తెలిపారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పేపర్ వినియోగాన్ని పెంచాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ స్వర్ణలత, తిరుమల, రోహిని, ప్రేమ్‌కుమార్, బీజేపీ నాయకులు కృష్ణ, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఆరోగ్యంపై జాగ్రత్తలు వహించాలి


విద్యార్థులతో మాట్లాడుతున్న వైద్య సిబ్బంది

భీంపూర్: మండల కేంద్రంలోని కేజీబీవీలో జిల్లా ఉపవైద్యాధికారి డా.సాధన ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. పాఠశాలలోని విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్య వివరాలు సేకరించారు. పలువురు విద్యార్థులకు సికిల్‌సెల్ అనీమియా, రక్త పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. మండల వైద్యాధికారి నిఖిల్ రాజ్, మండల ఆరోగ్య విస్తరణ అధికారి జ్ఞానేశ్వర్, పర్యవేక్షకులు మేఘ, రోహిదాస్ ఉన్నారు.

నేరడిగొండ: ప్రతీ విద్యార్థి ఆరోగ్య నియమాలు పాటిస్తేనే ఆరోగ్యంగా ఉంటారని హెచ్‌ఈవో పవార్ రవీందర్ అన్నారు. ఆరోగ్య పాఠశాల కార్యక్రమంలో భాగంగా శుక్రవారం లఖంపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఆశ్రమ బాలికల పాఠశాల, బుగ్గరం గ్రామంలో గల హాస్టల్‌లో అవగాహన కల్పించారు. హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్ రెడ్డి, ఆశా వర్కర్ జయమ్మ, హాస్టల్ ప్రిన్సిపాల్ అశోక్, వార్డెన్ స్వప్న పాల్గొన్నారు.

బోథ్: బాలికల గిరిజన ఆశ్రమ పాఠశాలలో శుక్రవారం మెడికల్ క్యాంప్ ఆరోగ్య పాఠశాల కార్యక్రమం నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్ డా. నవీన్ రెడ్డి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఎంఎల్‌హెచ్‌పీ అనూష, ఏఎన్‌ఎం స్నేహ పాల్గొన్నారు.

బ్యాంకింగ్ రంగంలో అవకాశాలు

ఆదిలాబాద్‌రూరల్: విద్యార్థులకు బ్యాంకింగ్ రంగంలో అనేక అవకాశాలు ఉన్నాయని ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ రామచంద్రారావు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ పురుషుల డిగ్రీ కళాశాలలో బ్యాంకింగ్ కెరీర్ అవగాహన సదస్సు నిర్వహించారు. బ్యాంకింగ్ రంగంలో ఉన్న అవకాశాలు, మెలకువలు, మార్పులపై విద్యార్థులకు వివరించారు. బ్యాంక్ అధికారులు బాలకృష్ణ, సురేశ్, కళాశాల ప్రిన్సిపాల్ శివకృష్ణ, అధ్యాపకులు, విద్యార్థులు ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


ఆదిలాబాద్‌టౌన్: పరిసరాలు పరిశీలిస్తున్న మలేరియా నివారణ అధికారి శ్రీధర్

ఆదిలాబాద్‌టౌన్: డెంగీ, సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా నివారణ అధికారి మెట్‌పెల్లివార్ శ్రీధర్ అన్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని చిల్కూరి లక్ష్మినగర్‌లో శుక్రవారం డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. కాలనీలో డెంగీ పాజిటివ్ రావడంతో ఆ ఇంటిని పరిశీలించారు. చుట్టూ పరిసరాల్లో నివారణ చర్యలు చేపట్టారు. యాంటీ లార్వా ఆపరేషన్ సమీక్షించారు. జిల్లాలో ఇప్పటివరకు 19 డెంగీ కేసులు నమోదైనట్లు తెలిపారు. సిబ్బంది ఉదయ్ కిరణ్, శంకర్, విష్ణు, అరుణ్, జ్యోతి, హరితరాణి, ప్రేమ్‌పవార్ తదితరులు పాల్గొన్నారు.

నార్నూర్: గాదిగూడ మండల కేంద్రంతో పాటు తోయగూడ, రాంపూర్ గ్రామాల్లో ఆదివాసీ సకల కళా సంక్షేమ సంఘం, ఐటీడీఏ, ఉట్నూర్ ఆధ్వర్యంలో పరిసరాల పరిశుభ్రతపై కళాజాత బృందం కళాకారులు శుక్రవారం ఆటపాటల ద్వారా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

శానిటేషన్, క్లోరినేషన్‌పై ప్రత్యేక దృష్టి

వర్షాకాలం సీజనల్ వ్యాధులు రాకుండా ఉండేందుకు శానిటేషన్, క్లోరినేషన్‌పై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి మొత్తిరాం అన్నారు. శుక్రవారం ఈఎంఆర్ఎస్ పాఠశాల ప్రిన్సిపాల్‌తో కలిసి మండలంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో గ్రామ పంచాయతీ వర్కర్లతో పారిశుద్ధ్య పనులు చేపట్టారు.

తాంసి: ఇంటితో పాటు పరిసరాల్లో మురికి నీరు నిల్వ ఉండకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని ఎంపీడీవో మోహన్ రెడ్డి అన్నారు. శుక్రవారం జామిడి గ్రామంలో డ్రైడే సందర్భంగా ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.

జనాభా నియంత్రణపై అవగాహన

నేరడిగొండ: ప్రపంచ జనాభా దినోత్సవం పురస్కరించుకుని పీహెచ్‌సీలో శుక్రవారం జనాభా నియంత్రణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో ర్యాలీ చేపట్టారు. అనంతరం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సద్దాం మాట్లాడుతూ సరైన వయస్సు, శారీరక, మానసికంగా సిద్ధంగా ఉన్నప్పుడే తల్లి అయ్యేందుకు సరైన సమయమన్నారు. హెచ్‌ఈవో పవార్ రవీందర్, హెల్త్ సూపర్‌వైజర్ సంతోష్, హెల్త్ అసిస్టెంట్ సాయన్న, శ్రీనివాస్ రెడ్డి, నరేందర్ రెడ్డి, ఫార్మసిస్ట్ శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ మోహన్, బాపూజీ, స్టాఫ్‌నర్స్ స్వాతి తదితరులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌టౌన్: జనాభా నియంత్రణతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఆదిలాబాద్‌అర్బన్ ఎంఈవో సోమయ్య అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు అశోక్ మంద ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని కోలిపుర పాఠశాలలో కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ప్రధానో పాధ్యాయుడు మురళి, లయన్స్‌క్లబ్ సభ్యులు రవీ ంద్ర, శేఖర్, సంజీవరావు, భీమ్‌రావు, పాండురంగ్, రుబీన, మాధవి పాల్గొన్నారు.

బెదిరింపులకు పాల్పడిన మాజీ కౌన్సిలర్ భర్త రిమాండ్


నిందితుడు సోమ రవి

ఆదిలాబాద్‌టౌన్: బెదిరింపులకు పాల్పడి ఇంటి నిర్మాణ పనులను అడ్డుకున్న మాజీ కౌన్సిలర్ భర్తపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్‌కుమార్ తెలిపారు. శుక్రవారం వన్‌టౌన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. అక్రమ నిర్మాణాలపై మున్సిపాలిటీ కార్యాలయంతో పాటు కోర్టులో ఫిర్యాదు చేసి ఇంటి యజమానుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్లు తెలిపారు. ఇంటి నిర్మాణాన్ని అడ్డుకున్నందుకు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని రాణిసతీజి కాలనీకి చెందిన సోమ రవి, జర్నలిస్టు డీవీఆర్ ఆంజనేయులుపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అయితే సోమ రవిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించగా, డీవీఆర్ ఆంజనేయులు పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని బ్రాహ్మణవాడకు చెందిన ఆయుష్ మకారియా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఇద్దరు ఆయన నుంచి రూ.90వేలు వసూలు చేశారని పేర్కొన్నారు. ఆయుష్ మకారియా సొంతంగా కలిగి ఉన్న ఆస్తిపై మ్యుటేషన్, బిల్డింగ్ అనుమతులను అడ్డుకున్నారని తెలిపారు. తన ఫిర్యాదులను వెనక్కి తీసుకోవాలంటే రూ.6లక్షలు ఇవ్వాలని బ్లాక్‌మెయిల్ చేసినట్లు చెప్పారు. ముందుగా బాధితుడి నుంచి రూ.90వేలు తీసుకుని, ఆ తర్వాత మిగతా డబ్బుల కోసం మానసికంగా వేధింపులకు గురిచేస్తున్నారని తెలిపారు. అట్రాసిటీ కేసు పెడతానని డీవీఆర్ ఆంజనేయులు బాధితుడిని ఫోన్‌లో బెదిరించిన ఆడియో రికార్డు అందించినట్లు పేర్కొన్నారు. దీంతోపాటు ఇతర వ్యక్తులను పంపి బెదిరింపులకు పాల్పడుతున్నట్లు తెలిపారు. ఈ వ్యవహారంపై బాధితుడి తండ్రితో పాటు ఆయన తాత మానసిక బాధలు పడి ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. వీరి నుంచి ప్రాణహాని ఉందని ఫిర్యాదులో పేర్కొన్నట్లు వివరించారు.

బదిలీపై వెళ్తున్న ఎస్సైకి సన్మానం

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీసుస్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వహించి నిజామాబాద్ టూటౌన్‌కు బదిలీపై వెళ్తున్న ముజాహిద్‌ను ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి, సీఐ కర్రె స్వామిలు సన్మానించారు. శుక్రవారం మావల పోలీసుస్టేషన్‌లో శాలువాతో సత్కరించారు.

నూతన ఎంపీడీవోకు..

నేరడిగొండ: మండల నూతన ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిన శేఖర్‌ను కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. శుక్రవారం కార్యాలయంలో కలిసి శాలువాతో సత్కరించారు. బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు ఆడే వసంత్ రావు, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బద్దం పోతారెడ్డి, సీనియర్ నాయకులు ఏలేటి రాజశేఖర్ రెడ్డి, మురళిగౌడ్, నారాయణ, మాజీ సర్పంచ్ నగేశ్, నాయకులు ఎండీ సద్దాం పాల్గొన్నారు.

ఐఐటీలో సీటు పొందిన విద్యార్థికి ..

బోథ్: సోనాల మండల కేంద్రానికి చెందిన ఉపాధ్యాయుడు కటకం చంద్రశేఖర్ కుమారుడు సాత్విక్ జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షలో జనరల్ ర్యాంక్ 5600, ఓబీసీ ర్యాంక్ 1179 సాధించి, జార్ఖండ్ రాష్ట్రం ధన్‌బాద్ ఐఐటీలో సీటు సాధించాడు. ఈమేరకు శుక్రవారం తుల శ్రీనివాస్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు తుల శ్రీనివాస్ సాత్విక్‌ను శాలువాతో సత్కరించారు. ఇర్ల ఎర్రన్న, భూషణ్, ఓఎస్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయురాలికి..

సొత్నాల: భోరజ్ మండలంలోని మండగడ యూపీఎస్ పాఠశాలలో ప్రధాన ఉపాధ్యాయురాలిగా బాధ్యతలు స్వీకరించిన అర్చనను, కాంగ్రెస్ నాయకులు మామిడి మల్లారెడ్డి, స్వాతి దంపతులు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో సునంద, ఆస్మా, సంతోష్, మచ్చేందర్ ఉన్నారు.

13న అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

తలమడుగు: మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల అంబేడ్కర్ సంఘం, మాల సంక్షేమ సంఘం అధ్యక్షుడు భూత దేవన్న, శ్రీనివాసులు కోరారు. శుక్రవారం వారు మాట్లాడుతూ మండల కేంద్రంలో కాటిపెల్లి వసంత రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి దాతల సహకారంతో ఈనెల 13న ఉదయం 11 గంటలకు విగ్రహావిష్కరణ ఉంటుందన్నారు. గంగన్న, శ్రీనివాస్, శశివర్ధన్, చంటి, భూమన్న తదితరులు పాల్గొన్నారు.

'రోగులు ఆధార్‌కార్డుతో రావాలి'

బోథ్: ఆసుపత్రికి వచ్చే ప్రతీ రోగి తప్పనిసరిగా ఆధార్‌కార్డుతో రావాలని వైద్య సిబ్బంది సూచించారు. శుక్రవారం విలేకరులతో వారు మాట్లాడుతూ ఆసుపత్రిలో నమోదులు, వైద్యసేవల రికార్డులు, ఔషధాల పంపిణీ వంటి సేవలను ఆధార్ ఆధారితంగా నిర్వహిస్తున్నామని తెలిపారు.

'బీజేపీ బీసీ వ్యతిరేక పార్టీ'

బోథ్: బీజేపీ బీసీ వ్యతిరేక పార్టీ అని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడె గజేందర్ అన్నారు. మండల కేంద్రానికి చెందిన సీనియర్ నాయకుడు మెరుగు నరసింహదాస్ శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. నరసింహ దాస్‌కు పార్టీ కండువా కప్పి, పార్టీలోకి ఆహ్వానించారు. బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గంగారెడ్డి, ఆత్మ చైర్మన్ రాజు యాదవ్, జిల్లా అధికార ప్రతినిధి చంటి, పోతన్న, షేక్ అబూద్, మహేందర్ ఉన్నారు.

గిరిజన విద్య పకడ్బందీగా అమలు చేయాలి

సంక్షిప్త వార్తలు

ఇచ్చోడ: గిరిజన విద్యను పకడ్బందీగా అమలు చేసేందుకు ఉపాధ్యాయులు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని మేడిగూడ కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్ స్వర్ణలత అన్నారు. శుక్రవారం మండలంలోని రఘుగూడలో నిర్వహించిన కాంప్లెక్స్ మీటింగ్‌లో పాల్గొని మాట్లాడారు. గిరిజన పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్య, భోజనం అందించాలన్నారు.

బోథ్ ఎస్సైగా శ్రీసాయి

బోథ్: బోథ్ ఎస్సైగా ఎస్.శ్రీసాయి నియమితులయ్యారు. వీఆర్‌లో ఉన్న ఆయన బోథ్‌కు బదిలీపై వచ్చారు. కాగా బోథ్ ఎస్సైగా విధులు నిర్వహించిన ప్రవీణ్ మావల ఎస్సైగా బదిలీ అయ్యారు.

తపస్ సభ్యత్వ నమోదు ప్రారంభం

తలమడుగు: తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) తలమడుగు మండల కమిటీ ఆధ్వర్యంలో మండలంలోని ఖోడద్, సుంకిడి, కుచులపూర్, ఉండం, ఝురి పాఠశాలలో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గోపికృష్ణ, ఉపాధ్యాయులు వాసుదేవ్ ముండే, కృష్ణసాగర్, నాందేవ్, నరేశ్, సుకుమార్ పాల్గొన్నారు.

పాఠశాలలో భవన మంజూరుకు కృషి

తలమడుగు: మండలంలోని దోర్లీ ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకోగా మాజీ జెడ్పీటీసీ గోక గణేశ్ రెడ్డి శుక్రవారం పరిశీలించారు. నూతన భవనం నిర్మాణానికి కలెక్టర్ రాజర్షి షాకు వినతిపత్రం అందించామని, త్వరలోనే భవన నిర్మాణ పనులు ప్రారంభమవుతాయన్నారు. అనంతరం మండలంలోని ఝరి, చేర్లపల్లి, సుంకిడి తదితర గ్రామాల్లో మృతి చెందిన వారి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఇందిరా మహిళా శక్తి సంబరాలు

భీంపూర్: మండల కేంద్రంలో ఇందిరా మహిళా శక్తి సంబరాల్లో భాగంగా డీపీఆర్‌వో ఆదేశానుసారం కళాకారులు ఆటపాటల ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఉచిత మహిళ బస్సు ప్రయాణం, మహాలక్ష్మి గ్యాస్ పథకం, మహిళా ఆర్థిక అభివృద్ధి, ఆరోగ్య బీమా తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. చాకటి రవి, గుంజాల రమేశ్, వెంకట్ రావు, రాజలింగు, మురళి పాల్గొన్నారు.

బోథ్: ఇందిరా మహిళా శక్తి సంబరాల సందర్భంగా మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో కళాజాత బృందం ఆధ్వర్యంలో మహిళా సంఘ సభ్యులకు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సెర్ప్ అమలు చేస్తున్న పథకాలపై పాటలు, ఆటల ద్వారా చైతన్యం కల్పించారు.

నేరడిగొండ: జిల్లా పౌరసంబంధాల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని చించోలి గ్రామంలో ఇందిరా మహిళా శక్తి సంబరాలు నిర్వహించారు. తెలంగాణ సాంస్కృతిక సారథి బృందం కళాకారులు పాటల రూపంలో మహిళలకు అవగాహన కల్పించారు. వీవో లీడర్లు, మహిళా సంఘాల సభ్యులు, సీసీ, వీవోఏలు పాల్గొన్నారు.

ఇంజనీర్ నవాజ్‌అలీ జయంతి

ఆదిలాబాద్‌టౌన్: తెలంగాణ ప్రాంతానికి చెందిన ఇంజనీర్ నవాజ్ అలీ జంగ్ బహదూర్ జయంతి ఘనంగా నిర్వహించారు. ఆర్కిటెక్ట్ ఇంజనీరింగ్ అండ్ ఐటీపీ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ చౌక్‌లో కార్యక్రమాన్ని చేపట్టారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘం అధ్యక్షుడు అన్నదానం జగదీశ్వర్, నాయకులు సయ్యద్ షబ్బీర్ అలీ, శ్రీనివాస్, విజయ్, సుశాంత్, అన్వర్ అలీ, అర్షద్ అలీ, రాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని భుక్తాపూర్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కోసం శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ సదానందం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యానగర్, సినిమా రోడ్, మోచిగల్లి, రాణిసతీజీ కాలనీ, భుక్తాపూర్, ద్వారకానగర్ ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఇచ్చోడ: మండలంలోని ఇచ్చోడ, నర్సాపూర్ సబ్‌స్టేషన్‌ల పరిధిలో శనివారం రెండు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ రాజు తెలిపారు. రెండు సబ్‌స్టేషన్‌లలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

బోథ్: మండలంలోని బోథ్, పొచ్చెర సబ్‌స్టేషన్‌ల పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ శ్రావణ్ తెలిపారు.

ఉచిత బస్సు సౌకర్యం అభినందనీయం

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని స్పోర్ట్స్ స్కూల్ విద్యార్థులకు పదేళ్ల నుంచి విజ్ఞాన, విహారయాత్రలకు జీఎస్టార్ ట్రావెల్స్ ఆధ్వర్యంలో ఉచిత బస్సు సౌకర్యం కల్పించడం అభినందనీయమని డీవైఎస్‌వో జక్కుల శ్రీనివాస్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియం నుంచి శుక్రవారం పాఠశాల విద్యార్థులు విజ్ఞానయాత్రకు వెళ్తున్న నేపథ్యంలో బస్సును ట్రావెల్స్ యజమాని ప్రమోద్ కుమార్ ఖత్రితో కలిసి ప్రారంభించారు. క్రీడా పాఠశాల ప్రిన్సిపాల్ భూమన్న ఉన్నారు.

యువకుల శ్రమదానం

ఇంద్రవెల్లి: మండలంలోని శంకర్‌గూడ గ్రామపంచాయతీ పరిధి దుబ్బగూడ రోడ్డు గుంతలు ఏర్పడి వర్షపు నీటితో చిత్తడిగా మారడంతో రెండు గ్రామాల యువకులు శుక్రవారం శ్రమదానం చేసి శంకర్‌గూడ –దుబ్బగూడ రోడ్డుపై ఏర్పడిన గుంతలు పూడ్చివేశారు. గుంతల్లో ఆగిన వరద నీటిని తొలగించారు. రోడ్డుకు ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించారు.

'భద్రాచలం ఈవోపై దాడి సరికాదు'

ఆదిలాబాద్‌టౌన్: భద్రాచలం ఆలయం ఈవోగా పనిచేస్తున్న రమాదేవిపై దాడి చేయడం సరికాదని విశ్వబ్రాహ్మణ సంఘం పట్టణ ప్రధాన కార్యదర్శి వెంకటస్వామి అన్నారు. ఈ దాడిని ఖండిస్తూ శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భద్రాచలం ఆలయానికి సంబంధించిన భూములను కాపాడితే కొందరు దాడికి దిగినట్లు పేర్కొన్నారు. సంఘం నాయకులు నర్సింహులు, స్వామి, దశరథ్, నరేందర్, మాణిక్, కిష్టయ్య పాల్గొన్నారు.

ఇద్దరికి డాక్టరేట్

నేరడిగొండ: మండలంలోని కుమారి, గుత్పాల గ్రామాలకు చెందిన నడికుంట తిమోతి రమణ, అమృత్ కుమార్‌లు కాంక్రెడ్ యూనివర్సిటీ జర్మనీ డాక్టరేట్ పట్టాలు అందుకున్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో సామాజిక సేవా కార్యక్రమాల సదస్సు నిర్వహించారు. సామాజిక సేవ కోసం విశేష కృషికి గుర్తింపుగా అవార్డులు దక్కాయి.

గంజాయి విక్రయదారుల అరెస్ట్

ఆదిలాబాద్‌టౌన్: గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని భుక్తాపూర్‌కు చెందిన అద్నాన్, షేక్ ఇమ్రాన్, షాబిర్ మార్కెట్ యార్డు వద్ద గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం రాగా దాడి చేసినట్లు తెలిపారు. అద్నాన్, షేక్ ఇమ్రాన్‌ను అరెస్టు చేయగా, షాబిర్ పరారైనట్లు తెలిపారు. 260 గ్రాముల గంజాయి, రెండు సెల్‌ఫోన్‌లు, ఒక స్కూటీని స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

గంజాయి సేవించిన ముగ్గురిపై కేసు

గంజాయి సేవించిన ఖుర్షీద్‌నగర్‌కు చెందిన షేక్ షోయబ్, షేక్ సాబిర్, షేక్ అజర్‌పై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు తెలిపారు. పట్టణంలోని అష్టలక్ష్మి స్పిన్నింగ్ మిల్లు వద్ద గంజాయి సేవిస్తుండగా పట్టుకుని టెస్టులు నిర్వహించగా పాజిటివ్‌గా నిర్ధారణ అయినట్లు తెలిపారు.

క్రైం కార్నర్..

వివాహిత మృతదేహం లభ్యం

తలమడుగు: ఆదిలాబాద్ శ్రీనగర్ కాలనీకి చెందిన వివాహిత జాదవ్ సుహాసిని (28) మృతదేహం శుక్రవారం మండలంలోని బరంపూర్ గ్రామ శివారులో గల వ్యవసాయ బావిలో లభ్యమైంది. మావల సీఐ స్వామి తెలిపిన వివరాల ప్రకారం జాదవ్ సుహాసిని గురువారం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాకపోవడంతో మావల పోలీస్‌స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదైంది. కాగా శుక్రవారం మృతదేహం లభ్యం కావడంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని బావిలో నుంచి మృతదేహాన్ని బయటకు తీశారు. అనంతరం కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కాగా ఆమె మృతిపై అనుమానాలు ఉన్నాయని సుహాసిని తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడు మృతి

బోథ్: సొనాల మండలం దేవుల్‌నాయక్ తండా గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు మోతీలాల్ రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బజార్‌హత్నూర్ మండలంలోని భూతాయి గ్రామంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న మోతిలాల్ సాయంత్రం బైక్‌పై ఇంటికి తిరిగివస్తుండగా దేవుల్‌నాయక్ తండా గ్రామ సమీపంలోని వైకుంఠధామం వద్ద ఎడ్లబండిని ఢీకొట్టాడు. దీంతో ఆయనకు తీవ్ర రక్తస్రావమైంది. గమనించిన స్థానికులు బోథ్‌లోని సామాజిక ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు.

వాగు దాటి వైద్యసేవలు


వాగు దాటుతున్న వైద్య సిబ్బంది

నేరడిగొండ: మండలంలోని గాజిలి గ్రామంలో శుక్రవారం వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. కాగా మార్గ మధ్యలో వాగు ఉండగా వైద్య సిబ్బంది వాగు దాటి వెళ్లి వైద్యసేవలు అందించారు.

బురదలో నడుచుకుంటూ వెళ్లి..

ఇచ్చోడ: నర్సాపూర్ పీహెచ్‌సీ పరిధిలో ఉన్న మారుమూల గిరిజన గ్రామం రాజులగూడ గ్రామానికి వెళ్లే రోడ్డు వారం రోజుల నుంచి కురిసిన వర్షాలకు బురదమయంగా మారింది. శుక్రవారం రాజులగూడలో నిర్వహించే వైద్య శిబిరానికి హెల్త్‌అసిస్టెంట్ రాథోడ్ కృష్ణ, ఏఎన్‌ఎం రేణుక, ఆశ వర్కర్ అన్నపూర్ణలు వెళ్లారు. కాలినడకన బురదలో నడుచుకుంటూ వెళ్లి సిబ్బంది వైద్యశిబిరం నిర్వహించారు.